వేములవాడలో జరుగుతున్న నిర్మాణ పనులు

- మూడు నెలలైనా ఎక్కడి పనులు అక్కడే
- రెండ్రోజుల్లో మట్టి తరలింపు చేస్తాం : ఇరిగేషన్ ఈఈ

బద్ది పోచమ్మ ఆలయ అభివృద్ధికి మట్టిదొరికేనా..?

వేములవాడ, అక్టోబర్ 28: వేములవాడ రాజన్న అనుబంధ ఆలయం బద్ది పోచమ్మ ఆలయ అభివృద్ధి పనులకు మట్టి దొరకడం లేదు. రూ.6.61కోట్ల వ్యయంతో ఏడాదిలోగా పనులు పూర్తిచేయడమే లక్ష్యంగా గత జూన్ 7న కాంట్రాక్టర్ పనులు ప్రారంభించారు.. పిల్లర్లు, ఫ్లింత్ భీం పూర్తి చేశారు. అయితే మట్టి నింపిన తర్వాతనే మిగిలిన పనులు చేసే అవకాశం ఉండగా, మూడున్నర నెలలుగా మట్టి దొరకడం లేదు. ఆలయ అధికారులు కార్యాలయాల చుట్టూ తిరిగి బేజారయ్యారు. ఈ క్రమంలో మారుపాక గ్రామంలోని చెరువులో మట్టి తీసుకునేందుకు సంబంధిత అధికారులు అనుమతి ఇచ్చారు. కానీ మట్టి తీసేందుకు అక్కడి రైతులు, గ్రామస్తులు అభ్యంతరం చెప్పడంతో తరలింపు తాత్కాలికంగా ఆగిపోయింది. అయితే పనుల జాప్యంపై ప్రజా ప్రతినిధులు, అధికారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పనుల పర్యవేక్షణ బాధ్యతలను ఇటీవలే రాజన్న ఆలయ ఈఈ అధికారి నుంచి జిల్లా స్థాయి అధికారికి అప్పగించగా, ఇప్పటికైనా పనులు ముందుకు సాగుతాయా..? లేదా అన్నది ప్రశ్నార్థకంగా మారింది. కాగా, ఆలయ అభివృద్ధి పనులకు కావలసిన మట్టి కోసం మరో రెండు మూడు స్థలాలను చూశామని, రెండు రోజుల్లో మట్టి తరలింపు చేపట్టి పనులు వేగవంతం చేస్తామని జిల్లా ఇరిగేషన్ ఈఈ అమరేందర్ రెడ్డి తెలిపారు.

అమరుల ఆశయ సాధన కోసం
ప్రతి పౌరుడు బాధ్యతగా మెలగాలి

జిల్లా కేంద్రంలో 2కే రన్‌లో ఎస్పీ అఖిల్ మహాజన్

2కే రన్‌లో పాల్గొన్న ఎస్పీ అఖిల్ మహాజన్, వైద్యులు, విద్యార్థులు

మాట్లాడుతున్న ఎస్పీ

రాజన్న సిరిసిల్ల, అక్టోబర్ 28 (నమస్తే తెలంగాణ): విధి నిర్వహణలో ప్రాణాలను సైతం లెక్కచేయకుండా ముందుకు సాగుతున్న పోలీసుల కృషి అభినందనీయమని ఎస్పీ అఖిల్ మహాజన్ కొనియాడారు. అమరుల ఆశయ సాధన కోసం ప్రతి పౌరుడు బాధ్యతగా మెలగాలని పిలుపు నిచ్చారు. పోలీసు అమర వీరుల సంస్మరణ వారోత్సవాల సందర్భంగా పోలీసు శాఖ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో సోమవారం 2కే రన్ నిర్వహించారు. బతుకమ్మ ఘాట్ నుంచి అంబేద్కర్ చౌరస్తా, అక్కడి నుంచి తిరిగి బతుకమ్మ ఘాట్ వరకు నిర్వహించిన కార్యక్రమంలో పోలీసులు, వైద్యులు, విద్యార్థులు, యువత, వాకర్స్ ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పోలీసు అమర వీరుల త్యాగాలను ప్రతి ఒక్కరూ స్మరించుకోవాలన్నారు. ప్రజా సంక్షేమం కోసం పనిచేస్తూ అమరులైన పోలీసుల త్యాగాలను స్మరిస్తూ ఏటా వివిధ కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. ప్రతి ఒక్కరి ఆరోగ్య రక్షణ, మానసిక దృఢత్వానికి యోగ, వ్యాయామం ప్రతినిత్యం చేయాలని సూచించారు. క్రీడలు మానసికొల్లాసాన్ని పెంపొందిస్తాయన్నారు. చెడు మార్గాల వైపు వెళ్లకుండా చదువుపై శ్రద్ధపెట్టి ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలని యువతకు పిలుపు నిచ్చారు. అమర వీరుల సంస్మరణ వారోత్సవాలను పురస్కరించుకొని నిర్వహించిన 2కే రన్‌లో విద్యార్థులు, యువత, వైద్యులు, ప్రజలు పెద్దసంఖ్యలో భాగస్వామ్యం కావడం సంతోషించ దగ్గదన్నారు. పాల్గొన్న మహిళలను ఈ సందర్భంగా ఆయన అభినందించారు. కార్యక్రమంలో అనదపు ఎస్పీ చంద్రయ్య, డీఎస్పీ చంద్రశేఖర్‌రెడ్డి, సీఐలు కృష్ణ, వెంకటేశ్వర్లు, ఆర్ఐలు యాదగిరి, రమేశ్, ఎస్ఐలు, సిబ్బంది, మెడికల్ కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

డయల్ యువర్ డీఎంకు స్పందన

కలెక్టరేట్, అక్టోబర్ 28 : ఆర్టీసీ డిపోలో డయల్ యువర్ డీఎం కార్యక్రమానికి సోమవారం అనూహ్య స్పందన వచ్చిందని సిరిసిల్ల డీఎం ప్రకాశ్‌రావు వెల్లడించారు. ఈ మేరకు అదనపు బస్సులు కావాలని పలువురు ప్రయాణికులు డయల్ యువర్ ఆర్టీసీ డీఎం ప్రోగ్రాంలో డిపో మేనేజర్‌కు కాల్స్ చేసి, మాట్లాడారు. ఆర్టీసీకి సంబంధించిన పలు సమస్యలను ముందుంచారు, సలహాలు, సూచనలు అందించారు. ఈ కార్యక్రమంలో ప్రజల నుంచి 15 విజ్ఞప్తులు వచ్చాయని డీఎం తెలిపారు. ముచ్చర్ల గ్రామానికి బస్సు కావాలని, సిరిసిల్ల నుంచి నిర్మల్‌కు, కాళేశ్వరంకు, కాకినాడకు కొత్త బస్సు సౌకర్యం కల్పించాలని కోరారన్నారు. అలాగే సిద్దిపేట డిపో బస్సులు, వేములవాడ డిపో బస్సులు సిరిసిల్ల కొత్త బస్టాండ్ వరకు వచ్చేలా చూడాలని, సూపర్ లగ్జరీ బస్సు సౌకర్యం కల్పించాలని కోరారని తెలిపారు. సిరిసిల్ల నుంచి కామారెడ్డికి పురుషులకు ప్రత్యేక బస్సులు నడపాలని (మహాలక్ష్మి వలన సీట్లు దొరకడం లేదని) ప్రయాణికులు విజ్ఞప్తి చేశారన్నారు. దీనికి సానుకూలంగా స్పందించిన డీఎం ప్రకాశ్ రావు ఆర్టీసీ ఉన్నతాధికారులకు విజ్ఞప్తులను పంపించి, పరిష్కరిస్తామని చెప్పారు.

విద్యార్థినులకు మెరుగైన వసతులు కల్పించాలి

ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

మాట్లాడుతున్న ఆది శ్రీనివాస్

కోనరావుపేట, అక్టోబర్ 28 : విద్యార్థినులకు మెరుగైన వసతులు కల్పించాలని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ సూచించారు. మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ విద్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలో విద్యార్థినులకు కల్పిస్తున్న మౌలిక వసతులపై ఆరా తీశారు. తరగతి గదులకు వెళ్లి విద్యార్థినుల సమస్యలను అడిగి తెలుసుకోవడంతో పాటు వంట నిర్వాహకులు, సిబ్బందితో మాట్లాడారు. మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఇందిరా, ఉపాధ్యాయ బృందం ఉన్నారు. అలాగే మండల కేంద్రంలో ఐకేపీ అధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. అంతకుముందు కొలనూర్ గ్రామంలో పర్యటించారు. ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఏడీడీ ఆర్డీడీవో శ్రీనివాస్, ఎంపీడీవో శ్రీనివాసమూర్తి, డీపీఎం శ్రీనివాస్, ఎపీఎం రాకేశ్, జిల్లా కిసాన్ సెల్ అధ్యక్షుడు కేతిరెడ్డి జగన్మోహన్ రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు చేపూరి గంగాధర్, పార్టీ మండలాధ్యక్షుడు పాషా, నేతలు వీరవేణి తిరుపతి యాదవ్ పాల్గొన్నారు.

చోరీ కేసులో ఒకరికి రెండేళ్ల జైలు

గాంధీ చౌక్, అక్టోబర్ 28: చోరీ కేసులో ఒకరికి రెండేళ్ల జైలు శిక్ష విధిస్తూ సిరిసిల్ల ప్రథమ శ్రేణి న్యాయమూర్తి ప్రవీణ్ సోమవారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం మేరకు.. 28 ఫిబ్రవరి 2017 సిరిసిల్ల అంభ భవానీ ఆలయంలో చోరీ జరిగిందని, ఆలయ అధ్యక్షుడు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు పోలీసులు కేసునమోదు చేసి, గంభీరావుపేటకు చెందిన వడ్డేపల్లి సత్యంను అరెస్టు చేసి, రి మాండ్‌కు తరలించి, కోర్టులో చార్జ్‌షీట్ దా ఖలు చేశారు. ప్రాసిక్యూషన్ తరపున పీపీ సందీప్ వాదించగా కానిస్టేబుల్ నరేశ్ సాక్షులను కోర్టులో ప్రవేశ పెట్టాడు. కేసు పూర్వ పరాలను పరిశీలించిన న్యాయమూర్తి నేరం రుజువు కావడంతో నిందితుడుకి శిక్ష విధించారు.

ఓటు హక్కుపై అవగాహన కల్పించాలి

అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్

మాట్లాడుతున్న ఖీమ్యానాయక్

కలెక్టరేట్, అక్టోబర్ 28 : జిల్లాలో అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కుపై అవగాహన కల్పించాలని, ఓటరు జాబితా సవరణ 2025 పై స్వీప్ కార్యక్రమాల ద్వారా విస్తృతంగా ప్రచారం చేయాలని అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్ సూచించారు. సోమవారం ఆయన కలెక్టరేట్ లో ఓటర్ జాబితా సవరణపై అంబాసిడర్లతో సమావేశం నిర్వహించారు. అక్టోబర్ 29న జిల్లాలో డ్రాఫ్ట్ ఓటర్ జాబితా విడుదల చేయనున్నట్లు తెలిపారు. 18 ఏండ్లు నిండిన ప్రతి ఒక్కరూ తమ పేర్లను జాబితాలో చెక్ చేసుకోవాలన్నారు. లేకుంటే నవంబర్ 29 లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. జిల్లాలోని 36 జూనియర్ కళాశాలలు, డిగ్రీ కళాశాలలో, కేజీబీవీ, రెసిడెన్షియల్ గురుకులాలు, పాలిటెక్నిక్ కళాశాలలో, ఇంజినీరింగ్ కళాశాలలో అర్హులైన యువకులను ఓటర్లుగా నమోదు చేసేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి విద్యా సంస్థకు ఒక క్యాంపస్ అంబాసిడర్ ను నియమించామన్నారు. ఈ సమావేశంలో వేములవాడ ఆర్డీవో రాజేశ్వర్, స్వీప్ నోడల్ అధికారి జడ్పీ సీఈవో వినోద్ కుమార్, ఎంపీడీవోలు, క్యాంపస్ అంబాసిడర్లు (కళాశాల, పాఠశాల ఉపాధ్యాయులు) అధికారులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న డా. ఎం వసంతరావు

లింగ నిర్ధారణ పరీక్షలు చేయొద్దు

- జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి వసంతరావు
- జిల్లా అడ్వైజరీ కమిటీ సమావేశం

కలెక్టరేట్, అక్టోబర్ 28: జిల్లాలోని ప్రైవేట్ దవాఖానల్లో లింగ నిర్ధారణ పరీక్షలు చేయొద్దని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి ఎం వసంతరావు ఆదేశించారు. లేకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. సోమవారం కలెక్టరేట్‌లోని వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో వైద్య ఆరోగ్య శాఖ అధికారి వసంతరావు ఆధ్వర్యంలో పీసీపీఎన్‌డీటీ కార్యక్రమ అడ్వైజరీ కమిటీ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో పీసీపీఎన్‌డీటీ కార్యక్రమంలో ప్రైవేట్ దవాఖానల్లో నిర్వహణ సరిగా లేనందున నాలుగు దవాఖానలకు స్టేట్ కమిటీ పర్యవేక్షణలో లోపాలు కనిపించినందున మొదటి హెచ్చరికగా వారికి షోకాజ్ నోటీసు జారీ చేసినట్లు తెలిపారు. చట్ట ప్రకారం.. డాక్టర్లు, నిర్వాహకులు లింగ నిర్ధారణ పరీక్షలు చేసినట్లు రుజువైతే వారికి రూ. 10 వేల జరిమానాతో పాటు మూడేళ్ల జైలు శిక్ష విధిస్తారని ప్రైవేట్ దవాఖాన స్కానింగ్ సెంటర్ల నిర్వాహకులకు సూచించారు. ఈ కార్యక్రమంలో మానేరు ఎన్జీవో ఆర్గనైజర్ చింతోజు భాస్కర్, జిల్లా డిప్యూటీ ఉపవైద్యాధికారులు అంజలి ఆల్ఫ్రెడ్, డా రజిత, డా రాజగోపాల్, అడ్వైజరీ కమిటీ గైనకాలజిస్ట్ శోభారాణి, జిల్లా ప్రభుతత్వాసుపత్రి సూపరింటెండెంట్ లక్ష్మీనారాయణ, డిప్యూటీ డెమో రాజ్‌కుమార్, హెచ్ఈ బాలయ్య పాల్గొన్నారు.

ఎస్సారార్‌కు ఇన్‌ఫ్లో

బోయినపల్లి, అక్టోబర్ 28 : మండలంలోని మాన్వాడ శ్రీ రాజ రాజేశ్వర జలాశయానికి సోమవారం శ్రీ రామ్‌సాగర్ ప్రాజెక్టు నుంచి వరద కాల్వ ద్వారా 4080 క్యూసెకల ఇన్‌ఫ్లో వచ్చినట్లు అధికారులు తెలిపారు. జలాశయ సామర్థ్యం 27.54 టీఎంసీలకు గాను 22.90 టీఎంసీలు ఉన్నట్లు తెలిపారు. జలాశయం నుంచి దిగువకు 3390 క్యూసెకల అవుట్ ఫ్లో బయటకు వెళ్తున్నట్లు తెలిపారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలి : కలెక్టర్

రోడ్డును పరిశీలిస్తున్న కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా

రాజన్న సిరిసిల్ల, అక్టోబర్ 28 (నమస్తే తెలంగాణ) : రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా అధికారులను ఆదేశించారు. జిల్లా కేంద్రంలోని రెండో బైపాస్‌లో జరుగుతున్న రోడ్డు ప్రమాదాలపై ఆయన స్పందించారు. అదనపు కలెక్టర్ ఖిమ్యానాయక్‌తో కలిసి సోమవారం బైపాస్‌రోడ్డును పరిశీలించారు. బైపాస్‌రోడ్డు వెంట సెంట్రల్ లైటింగ్ స్తంభాలకు విద్యుత్ లైట్లు ఏర్పాటు చేయాలని సెస్ అధికారులను ఆదేశించారు. యుద్ధ ప్రతిపాదికన, శాశ్వతంగా ఉండేలా పనులు చేపట్టాలని సూచించారు. ముఖ్యంగా చంద్రంపేట, బోనాల ఎక్స్‌రోడ్‌లో ప్రమాదాలు జరుగకుండా బోర్డులు పెట్టాలని మున్సిపల్, ఆర్ అండ్‌బీ అధికారులకు సూచించారు. ఆయన వెంట డీఈ వాణీ, ఏఈ స్వామి ఇతర అధికారులున్నారు.

దేశ శ్రేయస్సు కోసం జిల్లా అధికారులతో ప్రతిజ్ఞ

కలెక్టరేట్, అక్టోబర్ 28: ఈ నెల 31న సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతిని పురస్కరించుకొని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అన్ని శాఖల జిల్లా అధికారులతో ప్రతిజ్ఞ చేయించారు. సోమవారం కలెక్టరేట్‌లోని నిర్వహించిన ప్రజావాణి హాల్‌లో ప్రతిజ్ఞ చేయించారు. కాగా, సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతిని పురస్కరించుకొని 'దేశ శ్రేయస్సు, సమగ్రత సంస్కృతి' అనే నేపథ్యంలో ఈ నెల 28 నుంచి నవంబర్ 3 వరకు విజిలెన్స్ అవగాహన వారంగా జరుపుకోవాలని భారత ప్రభుత్వం సూచించింది. ఈ మేరకు సోమవారం 28న ఉదయం 11.00 గంటలకు కలెక్టర్, అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్, జిల్లా అధికారులు కలిసి కలెక్టర్ ప్రజావాణి కార్యాలయంలో భారత దేశాన్ని అవినీతి రహిత దేశంగా మార్చడంలో తమ వంతు కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేయించారు.

రోడ్డుపై మురుగు నీరు తొలగించండి సారూ..

రుద్రంగిలోని బ్యాంకు పక్క గల్లిలో రోడ్డుపై చేరిన మురుగు నీరు

రుద్రంగి, అక్టోబర్ 28 : మండల కేంద్రంలో రోడ్లపై మురుగు నీరు ప్రవహిస్తోంది. దీంతో ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. మండల కేంద్రంలోని బ్యాంకు పక్క గల్లీలో డ్రైనేజీ లేక ఇండ్ల నుంచి వచ్చే మురుగు నీరు, అలాగే వర్షం నీరు రోడ్డుపై చేరడంతో గుంతలు ఏర్పడ్డాయి. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

నమస్తే తెలంగాణ CLASSIFIED

WANTED PLOTS
★Plots Required: WANTED PLOTS & ACRE'S OF LANDS: SHAMEERPET, VIDHARBA ALIYABAD, INDUS PARK, CELEBRITY HOMES MY SPACE, GAYATRI LAYOUT THUMKUNTA, ORIJITHA LAYOUT, SILENT WORLD, S.N.R. LAYOUT, THIMMAIAPALLY, BOLLARAM AND NEAR BY CONTACT: 9949922669
NTK-335008

కావలెను
★కరీంనగర్ ప్రశాంత్‌నగర్ లోని హిమాలయ మినరల్ వాటర్ ప్లాంట్‌లో పనిచేయుటకు డ్రైవర్లు మరియు హెల్పర్లు (M/F) కావలెను. భోజనం+వసతి కల్పించబడును. సంప్ర|| సెల్: 7981054327, 7093413912
NTK-335404

WANTED
★హైదరాబాద్ & తెలంగాణ జిల్లాల్లోని ప్రముఖ టెలికాం టవర్ కంపెనీలో పనిచేయడానికి డిప్లొమా/ ITI చదివిన ఎల్కక్ట్రీషియన్లు కావలెను. ఫోన్: 8008289703.
KNR-NT-98842

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads
మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన నమస్తే తెలంగాణ
క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం
4 లైన్ల ప్రకటన కేవలం 200/- మాత్రమే
ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి 50/- మాత్రమే
3+1 స్కీం కలదు
ప్రకటనల విభాగం...
GST 5% వర్తించును
Cell: 9182 777 571
9182 777 189

రోడ్డు ప్రమాదంలో పలువురికి గాయాలు

ఒకరి పరిస్థితి విషమం

ఎల్లారెడ్డిపేట, అక్టోబర్ 28 : గొల్లపల్లిలో జరిగిన రోడ్డు ప్రమాదంలో పలువురికి గాయాలు కాగా, అందులో ఒకరి పరిస్థితి విషమంగా ఉంది. సోమవారం గొల్లపల్లి శివారులోని ఓ ఇటుక బట్టీల్లో పని చేసేందుకు నెల క్రితమే వచ్చిన ఒడిస్సాకు చెందిన చిత్తరంజన్ కాలి నడకన గొల్లపల్లిలో నిత్యావసర సరుకులు కొనుగోలు చేసి, తిరిగి పని ప్రదేశానికి వెళ్తున్నాడు. అదే సమయంలో బొప్పాపూర్‌కు చెందిన బొమ్మనవేణి ప్రసాద్ బైక్‌పై గొల్లపల్లి వైపు వెళ్తుండగా చిత్తరంజన్‌ను ఢీకొట్టాడు. దీంతో చిత్తరంజన్‌కు గాయాలు కాగా, చికిత్స కోసం సిరిసిల్ల ఏరియా దవావాఖానకు తరలించారు. ప్రసాద్, అతడి భార్య సంధ్య, కూతురు ప్రియకు స్వల్ప గాయాలయ్యాయి.

గంజాయి తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులు అరెస్టు

రుద్రంగి, అక్టోబర్ 28 : చందుర్తి సర్కిల్ పరిధిలోని మండలంలో గంజాయి తరలిస్తున్న ఇద్దరు యువకులను పట్టుకొని, రిమాండ్‌కు తరలించినట్లు సీఐ వెంకటేశ్వర్లు సోమవారం తెలిపారు. సీఐ వెంకటేశ్వర్లు తెలిపిన వివరాల ప్రకారం.. వేములవాడ మండలం నాంపల్లికి చెందిన జడల నాగరాజు, వేములవాడ టౌన్‌కు చెందిన తోట జగన్ అనే యువకులు గంజాయి తరలిస్తుండగా, ఎస్ఐ అశోక్ సమాచారం మేరకు.. వారిని పట్టుకొని వారి వద్ద 120 గ్రాముల గంజాయిని పట్టుకొని, కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

బతుకులు మారుతాయనుకున్నం

సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఎల్లారెడ్డి

వీర్నపల్లి, అక్టోబర్ 28 : కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే తమ బతుకులు మారుతాయనుకున్నం.. పది నెలలు గడుస్తున్నా సమస్యలు పట్టించుకున్న నాథుడే లేడని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఎగుమంటి ఎల్లారెడ్డి అన్నారు. మండలకేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో సోమవారం ఆయన మాట్లాడారు. పంచాయతీ కార్మికుల పనికి తగ్గ వేతనం కల్పించాలని, సుప్రీం కోర్టు తీర్పు ఇచ్చినా ప్రభుత్వం పట్టించుకుంటాలేదన్నారు. ఇప్పటికి ఐదు నెలల జీతం పెండింగ్‌లో ఉన్నాయని, వారం రోజుల్లో ఇవ్వకపోతే ఉద్యమం తీవ్రతరం చేస్తామన్నారు. ఆయన వెంట సీఐటీయూ మండలాధ్యడు లద్దురి నర్సయ్య, గౌరవ అధ్యడు న్యాత నర్సయ్య, సురేశ్, శేఖర్‌ం మల్లేశం, రాజవ్వ ఉన్నారు.

మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఎల్లారెడ్డి

సమస్యలు పరిష్కరించాలి

తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

ఇల్లంతకుంట, అక్టోబర్ 28 : ఉపాధ్యాయ సమస్యలను పరిష్కరించాలని తహసీల్దార్‌కు సోమవారం టీపీయూఎస్ ఉపాధ్యాయ సంఘం నాయకులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా టీపీయూఎస్ మండలాధ్యక్షుడు మధుసూదన్ రావు మాట్లాడుతూ ఐదేళ్లుగా ఉపాధ్యాయులకు రావాల్సిన బకాయిలను ఇప్పటి వరకు చెల్లించకుండా పెండింగ్‌లో ఉంచారని వాటిని వెంటనే విడుదల చేయాలన్నారు. పీఆర్సీతో పాటు అన్ని సమయ్యలు పరిష్కరించాలని అప్పటి వరకు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలుపుతామన్నారు. ఈ కార్యక్రమంలో టీపీయూఎస్ ఉపాధ్యాయ సంఘం నాయకులు మండల ప్రధాన కార్యదర్శి ఎర్రోజు బ్రహ్మచారి, రాష్ట్ర కార్యదర్శి కటకం శ్రీనివాస్, ఉపాధ్యాయులు రమణ, సుభాష్ రెడ్డి, సంతోష్ ఉన్నారు.

చేసేదంతా డైవర్షనే..

ఎల్లారెడ్డిపేట, అక్టోబర్ 28: ఆరు గ్యారంటీల అమలుపై ప్రజల నుంచి వస్తున్న వ్యతిరేకతను డైవర్ట్ చేయడానికి నిత్యం ఏదో కొత్త నాటకానికి కాంగ్రెస్ పార్టీ తెరలేపుతుందని మాజీ జడ్పీటీసీ చీటి లక్ష్మణ్‌రావు ఆరోపించారు. సోమవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్యామిలీ దావత్‌ను కూడా రేవ్ పార్టీ అంటూ చెత్త రాజకీయాలను నడుపుతున్నారంటూ ధ్వజమెత్తారు. పీఏసీఎస్ చైర్మన్ గుండారపు కృష్ణారెడ్డి, ఏఎంసీ మాజీ చైర్మన్ అందె సుభాశ్, నర్సింహారెడ్డి, బీఆర్ఎస్ పట్టణాధ్యక్షుడు ఎడ్ల సందీప్ ఉన్నారు.

రైతులు సద్వినియోగం చేసుకోవాలి

గంభీరావుపేట, అక్టోబర్ 28 : ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు వినియోగించుకోవాలని మండల వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ కొమిరిశెట్టి విజయ సూచించారు. మండలంలోని జగదాంబ తాండా, దేశాయిపేట గ్రామాల్లో సోమవారం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. సెస్ డైరెక్టర్ గౌరినేని నారాయణరావు, డైరెక్టర్లు అంజిరెడ్డి, మల్యాల రాజవీరు, విఠల్, కోట లింగం, రాజనర్సు, ప్రభాకర్, రాజిరెడ్డి, నేతలు, రాజుగౌడ్, శంకర్, ధన్‌రాజ్ పాల్గొన్నారు.

సిరిసిల్ల ఆర్డీవోగా వెంకట ఉపేందర్‌రెడ్డి

కలెక్టరేట్, అక్టోబర్ 28 : సిరిసిల్ల ఆర్డీవోగా కే వెంకట ఉపేందర్‌రెడ్డిని నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు సోమవారం ప్రిన్సిపాల్ సెక్రటరీ నవీన్ మిట్టల్ అధికారుల బదిలీలపై ఉత్తర్వులు వెలువరించారు. కాగా, కీసర ఆర్డీవోగా ఉన్న ఉపేందర్‌రెడ్డి సిరిసిల్ల ఆర్డీవోగా కేటాయించారు. సిరిసిల్ల ఆర్డీవోగా పని చేస్తున్న ఎల్ రమేశ్ హైదరాబాద్‌లో రిపోర్ట్ చేయాల్సిందిగా ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

డీఏలపై ప్రభుత్వం మరోసారి పునరాలోచించాలి

బోయినపల్లి, అక్టోబర్ 28 : పెండింగ్‌లో ఉన్న నాలుగు డీఏలపై ప్రభుత్వం మరో సారి పునరాలోచించాలని తహసీల్దార్ నారాయణ రెడ్డికి సోమవారం వినతిపత్రం అందజేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి పది నెలలవుతుండగా ఉద్యోగులకు ఆర్థిక పరమైన ఎటువంటి లావాదేవిలు జరగలేదని, పెండింగ్‌లో ఉన్న బకాయిలను వెంటనే విడుదల చేయాలని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం నాయకులు తహసీల్దార్‌కు ఇచ్చిన వినతిపత్రంలో కోరారు. బకాయి పడ్డ నాలుగు డీఏలను విడుదల చేసి, ఈ-కుబేర్‌లో ఉన్న విడుదల చేయాలని, పీఆర్సీ కమిటీ రిపోర్ట్ తెప్పించుకొని ఆమలు చేయాలని వారు డిమాండ్ చేశారు. లేకుంటే నవంబర్ 22న సత్యాగ్రహ దీక్ష చేయనున్నట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడు గసికంటి శ్రీనివాస్, నాయకులు వెంకట్రావు, నరేశ్, తిరుపతి, కనుకయ్య, గురుదేవ్, చంద్రమౌళి ఉన్నారు.

కళాకారులను ప్రభుత్వం ఆదుకోవాలి

చందుర్తి,అక్టోబర్ 28 : కళాకారులను ప్రభుత్వం ఆదుకోవాలని మండలంలోని కళాకారుల సంఘం నాయకులు దొంగరి లక్ష్మీరాజ్యం, మల్లేశం కోరారు. సోమవారం చందుర్తిలో వారు మాట్లాడుతూ కళాకారులను ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపైనే ఉందన్నారు.

చోరీ కేసులో ఇద్దరికి జైలు శిక్ష

బోయినపల్లి, అక్టోబర్ 28: చోరీ కేసులో ఇద్దరు వ్యక్తులకు 17నెలల జైలుశిక్ష విధిస్తూ వేములవాడ ప్రథమశ్రేణి న్యాయమూర్తి జ్యోతిర్మయి సోమవారం తీర్పు వెల్లడించినట్లు ఎస్ఐ పృథ్వీదర్‌గౌడ్ తెలిపారు. ఆయన తెలిపిన కథనం ప్రకారం.. కొదురుపాక గ్రామంలో ఎల్లమ్మ దేవాలయంలో సంగ ప్రణయ్, షేక్ సోహెల్ ఇద్దరు వ్యక్తులు చోరీకి పాల్పడగా, కొదురుపాకకు చెందిన నాగుల నాగరాజు ఫిర్యాదు మేరకు.. పోలీసులు కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలిం చారు. ఈ కేసులో విచారణ అధికారి మహేందర్ కోర్టులో చార్జీషీటు దాఖలు చేయగా, సీఎంఎస్ ఎస్ఐ రవీందర్‌నాయుడు ఆధ్వర్యంలో కోర్టు కానిస్టేబుల్ రాజేంద్ర ప్రసాద్ కోర్టులో సాక్ష్యులను ప్రవేశపెట్టారు. ప్రాసిక్యూషన్ తరుపున విక్రాంత్ కేసు వాదించగా పూర్వాపరాలు పరిశీలించిన న్యాయమూర్తి జ్యోతిర్మయి నేరస్తులకు ప్రణయ్, షేక్ సోహెల్‌కు 17 నెలల జైలుశిక్ష విధించినట్లు ఎస్ఐ ఒక ప్రకటనలో తెలిపారు.

చిన్నారులకు వైద్య పరీక్షలు

వీర్నపల్లి, అక్టోబర్ 28 : మండలకేంద్రంలోని మండల పరిషత్ ప్రాథమి కోన్నత పాఠశాలలో విద్యార్థులకు ఆర్‌బీఎస్‌కే వైద్యులు సంధ్యారాణి, సాయిచంద్ పరీక్షలు చేశారు. విద్యార్థులకు విటమిన్ లోపాలు, చర్మ, గొంతు, దంత , కంటి, వినికిడి సమస్యలు గుర్తించి చికిత్స అందించడానికి ఏర్పాట్లు చేస్తామని తెలిపారు. ఎదుగుదల లోపం, ఎనీమియా లోపాలను గుర్తించి మందులు ఇస్తున్నామని తెలిపారు.

వృద్ధాశ్రమంలో వైద్య పరీక్షలు

గంభీరావుపేట, అక్టోబర్ 28 : మండల కేంద్రంలోని అనాథ వృద్ధాశ్రమంలో వృద్ధులకు సోమవారం లింగన్నపేట సామాజిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో వైద్య పరీక్షలు చేశారు. కంటి సమస్యులున్న వృద్ధులకు పరీక్షలు చేసి, అవసరం ఉన్న వారికి కంటి అద్దాలు, మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో వైద్యులు వేణుగోపాల్‌రెడ్డి, సారా, ప్రకాశ్, అఖిల్, సీఎచ్‌వో రమేశ్, ఆశ్రమ వ్యవస్థాపకుడు మల్లుగారి నర్సాగౌడ్, వైద్య సిబ్బంది ఉన్నారు.

బుగ్గతండాలో కళాజాతా

ఎల్లారెడ్డిపేట, అక్టోబర్ 28 : బుగ్గరాజేశ్వర తండాలో పచ్చదనం పరిశుభ్రతపై తెలంగాణ సాంస్కృతిక సారథి ఆధ్వర్యంలో కళాజాతా నిర్వహించారు. సోమవారం గ్రామ కూడలిలో తడి, పొడి చెత్తను వేరుగా ఇవ్వాలని పాటల ద్వారా అవగాహన కల్పించారు. కళాకారులు శ్రీధర్‌రెడ్డి, రామచంద్రం, శ్రీనివాస్, గణేశ్ ఉన్నారు.

డ్రా పద్ధతిన పటాకుల దుకాణాలకు నంబర్లు

వేములవాడ, అక్టోబర్ 28: పట్టణంలో పటాకుల దుకాణాల లైసెన్స్ కోసం దరఖాస్తు చేసుకున్న వ్యాపారులకు సోమవారం ఆర్డీవో రాజేశ్వర్ డ్రా పద్ధతిన నంబర్లను కేటాయించారు. దుకాణాల ఏర్పాటుకు మొదటి 5 నంబర్లు, చివరి 5నెంబర్లకు డిమాండ్ ఏర్పడింది. దీంతో అధికారులపై తీవ్ర రాజకీయ ఒత్తిడి చేయడంతో చివరకు సోమవారం ఆర్డీవో కార్యాలయంలో డ్రా పద్ధతిన ఆర్డీవో రాజేశ్వర్ దుకాణాల ఏర్పాటుకు నంబర్లను కేటాయించారు. మొత్తం 31 మంది వ్యాపారులకు ఈ నంబర్లను కేటాయించినట్లు అధికారులు తెలిపారు. తహసీల్దార్ మహేశ్ ఉన్నారు.

పాఠశాలలో పింజర

సిరిసిల్ల రూరల్, అక్టోబర్ 28 : మండలంలోని ఒగులాపూర్‌లోని జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో పింజర పాము రావడంతో విద్యార్థులు భయాందోళన చెందారు. పాఠశాల ఆవరణలో కనిపించడంతో స్థానికుల సాయంతో చంపేశారు. కాగా, జడ్పీహెచ్ఎస్ పాఠశాల ఆవరణలోనే నర్సరీ, పల్లెప్రకృతి వనం ఉండడం తో పాములకు ఆవాసంగా మారాయన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పం దించి పాములు రాకుండా చర్యలు తీసుకోవాలని కోరారు.

పాఠశాలలో పింజర పాము

అనారోగ్యంతో మల్టీపర్పస్ వర్కర్ మృతి

వీర్నపల్లి, అక్టోబర్ 28 : మండలంలోని భూక్యాతండాకు చెందిన మల్టీ పర్పస్ వర్కర్ గుగులోత్ శంకరి (48) సోమవారం అనారోగ్యంతో మృతి చెందింది. కొంత కాలంగా గ్రామంలో మల్టీపర్పస్‌గా పనిచేస్తున్న శంకరీ మూడు నెలల కిందట అనారోగ్యం చెంది. చికిత్స చేయించుకున్నా ఫలితం లేకపోవడంతో సోమవారం ఉదయం ఇంటి వద్దే కన్నుమూసింది. మృతురాలికి భర్త దేవ్, కుమారుడు సాయి, కూతురు సంగీత ఉన్నారు. బాధిత కుటుంబాన్ని అదుకోవాలని బీఆర్ఎస్ మాజీ మండలాధ్యక్షుడు శ్రీరాంనాయక్ ప్రభుత్వాన్ని కోరారు.

ఆన్‌లైన్ సమస్యలపై లేబర్ కమిషనర్‌కు వినతి

కలెక్టరేట్, అక్టోబర్ 28: జిల్లాలోని లేబర్ కార్డుల ఆన్‌లైన్ సమస్యలపై హైదరాబాద్‌లోని లేబర్ కమిషనర్ గంగాధర్‌కు ఏఐటీయూసీ తరపున నాలుగు జిల్లాల భవన నిర్మాణ కార్మిక సంఘాల జిల్లా నాయకుల ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారవెల్లి ప్రవీణ్‌కుమార్, రాష్ట్ర అధ్యక్షులు గన్నార రమేశ్, వల్ల దేవేందర్ రెడ్డి, రాములు, గాజుల లక్ష్మీనారాయణ, నాలుగు జిల్లాల భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా నాయకులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేస్తాం

సిరిసిల్ల టౌన్, అక్టోబర్ 28 : మాజీ సర్పంచ్‌ల పెండింగ్ బిల్లులు చెల్లించకపోతే రాబోయే ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేస్తామని మాజీ సర్పంచ్‌ల జేఏసీ జిల్లా అధ్యక్షుడు అక్కెనపల్లి కరుణాకర్ ప్రకటించారు. ఈ మేరకు మాజీ సర్పంచ్‌ల జేఏసీ ఆధ్వర్యంలో పెండింగ్ బిల్లులు విడుదల చేయాలని చేపట్టిన రిలే నిరాహార దీక్షలు సోమవారానికి 11వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా అయన విలేకరులతో మాట్లాడుతూ పెండింగ్ బిల్లులు తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేశారు. రిలే నిరాహార దీక్షలు తాత్కాలికంగా విరమించుకున్నట్లు తెలిపారు.